సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 20 | నవంబర్ | 2024



తెల్ల బంగారానికి నల్లరోజులు

ఇటీవల వచ్చిన వరదల నుంచి తేరుకుంటున్న పత్తి రైతును తెగుళ్లు, నాసిరకం విత్తనాలు నట్టేట ముంచాయి.


8లో



విఘ్నేశ్వరునికి రూ.3.51 లక్షల రాబడి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారికి మంగళవారం ఒక్క రోజు వివిధ పూజా టిక్కెట్ల ద్వారా రూ.3,51,915 ఆదాయం లభించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

17 వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 4,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

ఓడలరేవులో అడవి పంది వేట

అల్లవరం: ఓడలరేవు సముద్ర తీర ప్రాంతంలో సంచరిస్తున్న అడవి పందిని సోమవారం రాత్రి ముగ్గురు వ్యక్తులు వలతో బంధించారు. ఓడలరేవు ఓఎన్‌జీసీ టెర్మినల్ డ్రైనేజీ వద్ద సంచరిస్తున్న అడవి పందిని వేటాడి తీసుకెళ్లారు. కొమరగిరిపట్నం, ఓడలరేవు, సముద్ర తీర ప్రాంతంలో కొంతకాలంగా అడవి పందులు సంచరిస్తున్నాయి. వీటిని తరచుగా కొందరు వేటాడి డబ్బులు చేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీర ప్రాంతంలో సంచరిస్తున్న వన్య ప్రాణులను కాపాడడంలో అటవీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు అంటున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలో ఆరుగురు

కాకినాడ సిటీ: తూర్పు–పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ఆరుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షణ్మోహన్ సగిలి మంగళవారం తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలోని కోర్టు హాలులో అభ్యర్థుల సమక్షంలో నామినేషన్ల పరిశీలన చేశారు. ఆరుగురు అభ్యర్థులు వేసిన నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కలెక్టర్ షణ్మోహన్ ప్రకటించారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి అభ్యర్థులుగా బుర్రా గోపిమూర్తి, గంధం నారాయణరావు, నామా వెంకటలక్ష్మి, కవల నాగేశ్వరరావు, పులుగు దీపక్, అహమద్ షేక్ పోటీలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి మంతెన పోటీ

పి.గన్నవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీ చేయనున్నట్టు రాజకీయ, రాష్ట్ర క్షత్రియ సేవా సంఘ నాయకుడు జి.పెదపూడి గ్రామానికి చెందిన మంతెన రవిరాజు వెల్లడించారు. మంగళవారం జి.పెదపూడిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. తనను గెలిపిస్తే పట్టభద్రులు, నిరుద్యోగులకు సేవలు అందిస్తానని అన్నారు.

భక్తులకు అనుగుణంగా రత్నగిరిపై ఏర్పాట్లు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి విచ్చేసే భక్తుల మనోభావాలను తెలుసుకుని దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్టు దేవస్థానం ఈఓ కే రామచంద్ర మోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్తికమాసంలో విచ్చేసే భక్తుల కోసం చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇచ్చాయన్నారు. ప్రధానంగా కంపార్ట్‌మెంట్లు, ప్రత్యేక క్యూ ల వల్ల భక్తుల ఇబ్బందులు తప్పాయని, స్వామివారి దర్శనం సుమారు గంటలో జరిగేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. భక్తులకు ఇబ్బంది లేకుండా స్వామివారి వ్రతాల నిర్వహించామని ఈఓ తెలిపారు. ఈ ఏర్పాట్లపై రోజూ వ్రతాలు, దర్శనం, క్యూ లు, పార్కింగ్ స్థలాలు, విశ్రాంతి మండపాలు, పులిహోర, దద్దోజనం పంపిణీ చేసే చోట భక్తుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించామని వివరించారు. సోమ, మంగళవారాలలో భక్తుల అభిప్రాయాలు తీసుకోగా ఏర్పాట్లు బాగున్నాయని తెలిపారని వివరించారు. ఎవరైనా తమకు ఎదురైన ఇబ్బందుల గురించి తెలిపినా, ఏర్పాట్లపై సలహాలు, సూచనలు ఇచ్చినా పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు.

నలుగురు యువకులపై కేసు నమోదు

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ జూనియర్ కళాశాల విద్యార్థి ఆర్.జయ సాయి యువరాజుపై దౌర్జన్యం చేసిన కేసులో నలుగురు యువకులపై మంగళవారం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయింది. వివరాలిలా ఉన్నాయి. ఒక యువతి విషయంలో ఈ నెల 5న నలుగురు యువకులు యువరాజును స్థానిక సత్యజ్యోతి థియేటర్ వెనుక ఖాళీ స్థలంలోకి తీసుకు వెళ్లి రక్తపు గాయాలయ్యేలా దాడిచేశారు. ఆ దాడిని వీడియో తీసిన యువకులు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయడంతో ఈ ఘటన వెలుగు చూసింది. దీంతో పోలీసులు కళాశాలకు వచ్చి ఆరా తీశారు. ఈ క్రమంలో విద్యార్థి తండ్రి శంకర్, తన కుమారుడిని తీసుకువెళ్లి ఆసుపత్రిలో చేర్పి మలికిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ఇచ్చిన సమాచారం ఆధారంగా రవి అనే యువకుడితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ అస్మదీయ!

- ర్యాంపుల కేటాయింపులో కొత్త ఎత్తుగడలు
- తక్కువ కోట్ చేయడమే నేరమని 'కోస్టల్' టెండర్లు రద్దు
- ఎల్–2కు దక్కనున్న అవకాశం
- సాన్వికను సాగనంపేందుకు సెగ పెడుతున్న బీ గ్యాంగ్
- మొత్తం ర్యాంపుల కైవసానికి టీడీపీ నేత పైరవీలు



సాక్షి, అమలాపురం: 'ప్రభుత్వ ఉచిత ఇసుక పాలసీలో రాష్ట్ర మంత్రులు.. ఎమ్మెల్యేలు.. కూటమి నాయకులు తల దూర్చవద్దు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకుని రావద్దు' అని సీఎం చంద్రబాబు నాయుడు కూటమి పార్టీల ప్రజా ప్రతినిధులు, నాయకులను మొదటి నుంచి హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సదరు నాయకులు ఆ హెచ్చరికలను గడ్డిపోచగా తీసి పారేస్తున్నారు. అక్రమ సంపాదనే పరమావధిగా బరితెగిస్తున్నారు. అయినా అక్రమాలపై చంద్రబాబు ఏ చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. మద్యం సిండికేట్‌లు, ఇసుక తవ్వకాలు ఆ నాయకులకు ప్రధాన ఆదాయ వనరులుగా మారిపోయాయి. దీనిలో భాగంగా కోనసీమ జిల్లాలో 12 ఇసుక ర్యాంపులపై పట్టుకు అధికార పార్టీ కీలక నాయకుడు చేస్తున్న యత్నాలకు ఏకంగా ప్రభుత్వమే దాసోహమైపోయింది. తమను కాదని టెండర్లు వేసిన వారిలో కొందరిని సాంకేతిక కారణాలతో తప్పించగా.. మరి కొందరిని నిబంధనల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేయడం ద్వారా పొమ్మనకుండానే పొగబెడుతున్నారు.

కోనసీమ జిల్లాలో 12 ఇసుక ర్యాంపులకు సంబంధించి ఈ నెల 14న టెండర్లు ఖరారు చేసిన విషయం తెలిసిందే. 16వ తేదీ నుంచి ఆయా ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు మొదలు కావాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ఇసుకకు కొరత ఉండడంతో వెంటనే తవ్వకాలు మొదలవుతాయని భవన నిర్మాణ యజమానులు, నిర్మాణ రంగంలోని కార్మికులు ఎదురుచూశారు. కాని పరిస్థితి అందుకు విరుద్ధంగా మారింది. ఇప్పటికీ ర్యాంపులలో ఇసుక తవ్వకాలు మొదలు కాలేదు.

'కోస్టల్ కన్సల్టెంట్' టెండర్లు రద్దు

12 ర్యాంపులకు నిర్వహించిన టెండర్లలో 12 కంపెనీలు పాల్గొన్నాయి. వీటిలో కోస్టల్ కన్సల్టెంట్ సంస్థ మూడు ర్యాంపులను దక్కించుకుంది. ఆత్రేయపురం మండలంలోని అంకంపాలెం, ఊబలంక, తాతపూడి ర్యాంపులను చాలా తక్కువ ధరకు కోట్ చేసి వాటిని ఈ సంస్థ దక్కించుకుంది. ఇసుక తవ్వకాలకు టన్నుకు రూ.120 చొప్పున ధర నిర్ణయించి తక్కువకు టెండర్లు వేయాల్సిందిగా కోరింది. ఈనెల 14వ తేదీన 12 ర్యాంపులకు టెండర్లను ఖరారు చేశారు. అయితే అతి తక్కువకు టెండరు వేసిన కోస్టల్ కన్సల్టెంట్ సంస్థ టెండర్లను రద్దు చేశారు. ఈ సంస్థ అంకంపాలెం, ఊబలంక ర్యాంపులలో టన్ను ఇసుక తవ్వకం, లోడింగ్, స్టాక్ పాయింట్‌కు తరలింపునకు రూ.30 చొప్పున, తాతపూడి ర్యాంపులో ఇసుక తవ్వకాలకు రూ.26.10 చొప్పున కోట్ చేసి ర్యాంపులను దక్కించుకుంది. ప్రభుత్వం కోట్ చేసిన ధరలో నాల్గవ వంతు ధర కోట్ చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఇలా తక్కువ ధరకు కోట్ చేసి అక్రమాలు చేస్తారని ఈ మూడు కంపెనీల టెండర్లు రద్దు చేశారు. ఉచిత ఇసుక పాలసీలో పారదర్శకత కోసమే ఇలా నిర్ణయం తీసుకున్నామని మైనింగ్ అధికారులు చెప్పడం చూసి జిల్లా వాసులు ముక్కున వేలేసుకుంటున్నారు. వీరు తప్పుకోవడంతో ఈ ర్యాంపులలో ఎల్–2గా నిలిచిన వారికి టెండర్లు దక్కనున్నాయి. అంకంపాలెం ర్యాంపునకు రూ.115కు టెండరు వేసిన సుధాకర్ అనే సంస్థకు, ఊబలంక రూ.95 కోట్ చేసిన ఆర్‌ఎస్‌ఆర్‌కు, తాతపూడి రూ.115కు కోట్ చేసిన సుధాకర్‌కు ఆయా ర్యాంపులు దక్కనున్నాయి.

ఫలించిన 'బీ' గ్యాంగ్ యత్నాలు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్తపేట కేంద్రంగా ఇసుక తవ్వకాలపై 'బీ' గ్యాంగ్ పట్టు సాధిస్తూ వస్తోంది. స్థానికంగా ఒక కీలక నేత, ఆయన ముఖ్య అనుచరులు కలిసి ర్యాంపులలో హవా కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం నిల్వ చేసిన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద ఇసుకను కూటమి ప్రభుత్వం వచ్చిన రెండో రోజు నుంచే దొడ్డిదారిన విక్రయాలు మొదలు పెట్టారు. తరువాత ప్రభుత్వం ఇసుక విక్రయాలకు అనుమతి ఇవ్వగా లారీకి అదనంగా రూ.ఐదు వేల చొప్పున బీ ట్యాక్స్ వసూలు చేశారు. ఇప్పుడు ఇదే నియోజకవర్గంలో ఉన్న పది ర్యాంపులపై పెత్తనం చేసేందుకు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా తమ కంపెనీ మాత్రమే టెండర్లు వేయాలని నిర్ణయించుకుంది. కాని ఇదే జిల్లాకు చెందిన ఒక రాష్ట్రస్థాయి ప్రజా ప్రతినిధి ఆత్మ బినామీ పేరుతో టెండర్లు వేయడం, తరువాత మరికొన్ని కంపెనీలు టెండర్లు వేశాయి. టెండర్లు ఖరారైనప్పటికీ బీ గ్యాంగ్ వెనకడుగు వేయడం లేదు. ఉన్నత స్థాయిలో పైరవీలు చేసి మూడు ర్యాంపులు దక్కించుకున్న కోస్టల్ కన్సల్టెంట్ సంస్థను అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని చెప్పి బయటకు పంపేశారు. ఇలా చేయడం ద్వారా మరో బీ గ్యాంగ్‌కు దక్కిన ర్యాంపుల సంఖ్య పెరిగింది.

సాన్వికకు సెగ

కోస్టల్‌తో పాటు సాన్విక సంస్థకు సైతం బీ గ్యాంగ్ నిబంధనల పేరుతో చుక్కలు చూపిస్తోంది. ఈ సంస్థ ఆత్రేయపురం, వద్దిపర్రు–1, వద్దిపర్రు–2 ర్యాంపులను దక్కించుకుంది. దీనిలో భాగంగా ఆత్రేయపురంలో బాటలు వేసేందుకు ప్రయత్నించగా స్థానిక టీడీపీ నాయకులు అడ్డుకోవడం విశేషం. ఇసుక తవ్వకాల నిబంధనల మేరకు మనుషులతో తవ్వకాలు చేయించాలని, లేకుంటే అడ్డుకుని తీరుతామని హెచ్చరికలు జారీ చేయడం విశేషం. ఈ సంస్థను కూడా పొగ పెట్టి పంపించడం ద్వారా ర్యాంపులపై పట్టు సాధించేందుకు బీ గ్యాంగ్ సిద్ధమవుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కొత్తపేట మండలం మందపల్లి ర్యాంపులో ట్రాక్టర్లతో ఇసుక తరలింపు

తీర రక్షణకు సాగర్ కవచ్

పోలీసు సబ్ డివిజన్ పరిధిలో నేడు, రేపు మాక్ డ్రిల్ నిర్వహణ



అమలాపురం టౌన్: అల్లవరం మండలం ఓడలరేవు సముద్ర తీరం నుంచి ఐ.పోలవరం మండలం భైరవపాలెం తీరం వరకూ బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు సాగర్ కవచ్ కార్యక్రమాలు జరుగుతాయి. సముద్ర తీర రక్షణకు ఆయా తీరాల్లో సివిల్ పోలీస్, మెరైన్ పోలీస్ విభాగాల అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఓడలరేవులో ఉన్న మెరైన్ పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది కూడా మాక్ డ్రిల్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. సాగర్ కవచ్ నోడల్ అధికారి అయిన డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్ సముద్ర తీర రక్షణ మాక్ డ్రిల్‌ను పర్యవేక్షించనున్నారు. అమలాపురం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సముద్ర తీరం వెంబడి ఉన్న బీచ్‌లైన అల్లవరం మండలం ఓడలరేవు, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానం, వాసాలతిప్ప, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలలోని పలు సముద్ర బీచ్‌ల్లో ఏక కాలంలో రెండు రోజులపాటు ఈ మాక్ డ్రిల్ జరగనుంది. ఓడలరేవు సముద్ర తీరంలో మాక్ డ్రిల్ ఏర్పాట్లను అమలాపురం రూరల్ ఇన్‌చార్జి సీఐ పి.వీరబాబు మంగళవారం పర్యవేక్షించారు. సముద్ర తీరాన్ని ఎలా రక్షించుకోవాలనే అంశంపై అవగాహనతో కూడిన మాక్ డ్రిల్ జరుగుతుందన్నారు. సాగర్ కవచ్‌కు సంబంధించి ఓడలరేవు సముద్ర తీరంలో తగిన ఏర్పాట్లు చేసినట్లు సీఐ వీరాబాబు తెలిపారు.

నేత్రపర్వంగా భీమేశ్వరుని జల విహారం



పంచారామ క్షేత్రంలోని పుష్కరిణిలో స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలోని బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి తెప్పోత్సవం మంగళవారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. కార్తిక మాసంలో స్వామి వారి జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకొని ప్రతీ ఏడాది ఆలయ కోనేరులో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా రాత్రి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను బ్యాండ్ మేళాలు వేద మంత్రాల మధ్య ఆలయ కోనేరు వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. పూలతో అలంకరణ చేసిన వేదికపై స్వామివారి అమ్మవారి విగ్రహాలను ఉంచి ఆలయ పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పారిశ్రామిక వేత్త వీరేంద్ర, నిమ్మకాయల రంగనాథ్, ఈఓ భళ్ల నీలకంఠం దంపతులు వేదికపై పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పండితులు పూజలు చేసి వేదికపై ఆశీనులైన వారికి ఆశీర్వచనాలు అందజేశారు. బాణసంచా కాల్పుల మధ్య స్వామి,అమ్మవార్లను ఆలయ కోనేరులో విద్యుత్తు దీపాలంకరణతో ఏర్పాటు చేసిన హంస వాహనంపై ఉంచి వేదపండితుల ఆధ్వర్యంలో తెప్పోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మూడు పర్యాయాలు కోనేరులో స్వామివారి జలవిహారం అత్యంత అద్భుతంగా జరిగింది. ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, భక్త సంఘం నాయకులు బిక్కిన సాయి, ఆర్వీ సుబ్బరాజు భక్తులకు సేవలందించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

వ్యవసాయంలో సాంకేతిక విప్లవం 'డ్రోన్'

- కలెక్టర్ మహేష్ కుమార్
- వివిధ దశల్లో యువతకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికత విప్లవాత్మకమైనదని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ ఇచ్చే అంశంపై ఆయన కర్నూలుకు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శిక్షణ సంస్థ ద్వారా రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా కోనసీమ, సత్యసాయి జిల్లాలను ఎంపిక చేసిందన్నారు. సంస్థ ప్రతినిధులు కె.కృష్ణ నాయక్, నరేష్ బాబు, విష్ణుమూర్తి ఐదు రోజుల పాటు స్థానికంగా వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికతపైన, రెండో దశలో సర్వే, శాంతి భద్రతలు, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, మెడికల్ అండ్ హెల్త్ అప్లికేషన్లు, విపత్తుల నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ ఇస్తారన్నారు. ఉదయం టెక్నాలజీ సంబంధిత అంశాలపై గోదావరి భవన్‌లో, సాయంత్రం ప్రయోగాత్మకంగా జీఎంసీ బాలయోగి స్టేడియంలో శిక్షణ ఇస్తారన్నారు. జిల్లాలో మూడు డివిజన్ల నుంచి రెండేసి మండలాలను ఎంపిక చేసి, 100 మంది విద్యావంతులైన అభ్యుదయ రైతులను, మరో 100 మంది విద్యావంతులైన స్వయం సహాయ సహాయక సంఘాల మహిళలను ఎంపిక చేయాలన్నారు. సహాయకులుగా మరో 30 మంది అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థులను ఎంపిక చేసి డిసెంబర్ రెండో వారంలో నిర్వహించే శిక్షణకు సిద్ధం చేయాలన్నారు. 1500 ఎకరాలకు ఒక డ్రోన్ చొప్పున ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఆధారిత మండలాల్లోని ఎస్‌హెచ్‌జీలకు డ్రోన్ దీదీ పథకం ద్వారా డ్రోన్ల కొనుగోలుకు గరిష్టంగా రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయని దీనిలో రూ.8 లక్షలు సబ్సిడీగా అందిస్తున్నాయని రెండు లక్షలు మండల సమాఖ్య సభ్యులు చెల్లించాలని వివరించారు. రైతులు తమ భూమిని మరింత సమర్థవంతంగా కవర్ చేయడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివ శంకర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బోసుబాబు, జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మన మరుగుదొడ్డి- మన గౌరవం'పై అవగాహన పెంచాలి

వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై విస్తృత ప్రచారం చేసి 'మన మరుగుదొడ్డి- మన గౌరవం' పేరిట అవగాహన పెంపొందించాలని కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ తాగునీరు, పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి డిసెంబర్ 10 వరకు స్వచ్ఛత కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాల నిర్వహణపై వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మండల స్థాయి అధికారుల వరకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అవగాహన కల్పించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా పారిశుధ్య విభాగం సూపరింటెండెంట్ ఇంజినీర్ సీహెచ్‌ఎన్‌వీ కృష్ణారెడ్డి, డీఈ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి పండించొద్దు

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

దేవరపల్లి: పరిమితికి మించి పొగాకు పండించవద్దని పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ రైతులకు విజ్ఞప్తి చేశారు. 2024–25 పంట నియంత్రణపై మంగళవారం దేవరపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు వేలం నిర్వహణాధికారి హేమస్మిత అధ్యక్షత వహించగా చైర్మన్ యశ్వంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందని తెలిపారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు బ్రెజిల్, జింబాబ్వే దేశాల్లో 310 మిలియన్ల కిలోలు, ఆఫ్రికా దేశాల్లో 200 మిలియన్ల కిలోలు, టాంజానియాలో 200 మిలియన్ల కిలోలు పొగాకు ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రపంచంలో అతి పెద్ద ఉత్పత్తిదారు అయిన చైనాలో 650 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందని తెలిపారు. దీనిని బట్టి చూస్తే వచ్చే 2024–25 పంట కాలంలో అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 2023–24 పంట కాలంలో అంతర్జాతీయంగా పొగాకు ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగకపోవడంతో మన పొగాకుకు ఎన్నడూ లేని డిమాండ్ ఏర్పడిందన్నారు. దీంతో కిలో గరిష్ఠ ధర రూ. 410 లభించిందని వివరించారు. 2023-24 పంట కాలంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌ఎల్‌ఎస్, ఎస్‌బీఎస్, ఎన్‌బీఎస్ ప్రాంతాల్లోని 18 వేలం కేంద్రాల పరిధిలో 142 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఉండగా, 172 మిలియన్ల కిలోలు ఉత్పత్తి జరిగిందన్నారు. అదనపు పంటపై అపరాధ రుసుం రద్దు చేసి రైతులను ఆదుకోవాలన్న రైతు సంఘాల నాయకుల అభ్యర్థన మేరకు ప్రజాప్రతినిధుల కృషి వల్ల ఆంధ్రప్రదేశ్‌లో రూ. 120 కోట్ల అపరాధ రుసుం రద్దు చేయగా, ఎన్‌ఎల్‌ఎస్ ప్రాంతంలో రూ.19 కోట్లు రద్దు చేసినట్టు ఆయన తెలిపారు. 2024–25 పంట కాలంలో రాష్ట్రంలో 170 మిలియన్ల కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇచ్చిందని, దీనికి మించి ఉత్పత్తి చేయరాదని ఆయన రైతులకు విజ్ఞప్తి చేశారు.. బర్లీ పొగాకు విపరీతంగా వేస్తున్నారని, ఇది మన పొగాకుకు పోటీ కాబోతుందని ఆయన తెలిపారు. మన దేశంలో పండిన పొగాకును ఇండోనేషియా, దుబాయ్, జర్మనీ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. వర్జీనియా పొగాకుకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉంటుందని తెలిపారు. రాజమహేంద్రవరం రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు వాణిజ్యసరళి పంట కావడం వల్ల స్థితిగతులు మారుతుంటాయని తెలిపారు. నాణ్యతా ప్రమాణాలకు డిమాండ్ ఉంటుందన్నారు. రైతులు కాట్రు సత్యనారాయణ, ఈలపోలు చిన్ని, నరహరిశెట్టి రాజేంద్రబాబు, కాట్రగడ్డ సత్యనారాయణ, రైతు సంఘం అధ్యక్షులు కరుటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు బయట అమ్మకాలను అరికట్టాలని చైర్మన్ యశ్వంత్ కుమార్‌ను కోరారు. గత ఏడాది విజిలెన్స్ లేకపోవడం వల్ల బయట అమ్మకాలు విచ్చవిడిగా సరిగాయని, వచ్చే ఏడాది గట్టి నిఘా ఏర్పాటు చేసి బయట వ్యాపారులను కట్టడి చేయాలని రైతులు కోరారు.

కౌశల్ పోటీల్లో పాల్గొనండి



కౌశల్ ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న కౌశల్ సైన్స్ క్విజ్ పోటీల్లో ఉత్సాహం పాల్గొనాలని జిల్లా కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. భారతీయ విజ్ఞాన మండలి (బీవీఎం), సైన్స్ సిటీ ఆంధ్రప్రదేశ్, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలు నవంబర్ 17 నుంచి ప్రారంభమయ్యాయని, 22వ తేదీ వరకూ నిర్వహించే ఆన్‌లైన్ పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా 241 పాఠశాలల నుంచి 3,378 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని మంగళవారం తెలిపారు.

క్లుప్తంగా


108 కిలోల విబూదితో శివయ్యకు అభిషేకం



విబూదితో నిండిన ఉమా రామలింగేశ్వర స్వామి

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం 108 కిలోల విబూదితో స్వామి వారిని అభిషేకించారు. ఆలయ పురోహితులు చంద్రమౌళి సుబ్బారావు శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

శతాధిక వృద్ధుడి మృతి



చిన అప్పారావు

జగ్గంపేట: స్వాతంత్ర్యోద్యమం నుంచి కూడా రాజకీయాలలో తిరుగుతూ ప్రముఖ నేతల వెంట నడిచిన శతాధిక వృద్ధుడు బూరా చిన అప్పారావు సోమవారం రాత్రి మృతి చెందారు. జగ్గంపేట అంబేద్కర్ నగర్‌కు చెందిన అప్పారావు 1907లో జన్మించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రసుత్తం అప్పారావుకు 116 సంవత్సరాలు అని కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో కూతురు బి.సరోజిని వద్ద ఇంటి వద్ద ఉంటున్నారని వారు తెలిపారు. ఆయన మృతికి స్థానిక నేతలు, పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

కాకినాడ క్రైం: కాకినాడ నారాయణ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. గైగోలుపాడు, శాంతినగర్‌కు చెందిన 17 ఏళ్ల విద్యార్థినులు మంగళవారం కళాశాలకు వచ్చి, అక్కడి నుంచి సర్పవరంలో ఉన్న ఎస్ఆర్ఎంటి మాల్‌కు వెళ్లారు. ఓ వ్యక్తి ఫోన్ తీసుకుని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాము సమీపంలో దేవాలయానికి వెళుతున్నామని చెప్పారు. ఆ తర్వాత వారి జాడ తెలియరాలేదు. రాత్రి గడిచినా ఇంటికి చేరకపోవడంతో ఆందోళన పడిన తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూ టౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విద్యార్థినుల కోసం గాలిస్తోంది.

25 వరకూ దూర విద్య అడ్మిషన్లు

నల్లజర్ల: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈనెల 25 వరకూ టెన్త్, ఇంటర్‌లకు తత్కాల్ అడ్మిషన్లు చేసుకోవచ్చని దూబచర్ల స్టడీ సెంటర్ కో–ఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయాన్ని ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తెల్ల బంగారానికి నల్లరోజులు



దుర్గాడలో పత్తి పంటను నరికేస్తున్న రైతు



దుర్గాడలో రైతులు నరికేసిన పత్తి పంట

- రైతుకు వి'పత్తి'
- పత్తి పంటను తెగనరుకుతున్న వైనం
- దిగుబడి దెబ్బతీస్తున్న తెగుళ్లు
- కాయ పగలక పత్తి రాని పరిస్థితి
- రైతును నట్టేట ముంచిన నాసిరకం విత్తనాలు

జిల్లాలో పరిస్థితి ఇలా..

సాగు	11,850 ఎకరాల్లో
రైతులు	8,890 మంది
ఏటా దిగుబడి	2,13,300 క్వింటాళ్లు

పిఠాపురం: ఇటీవల వచ్చిన వరదల నుంచి తేరుకుంటున్న పత్తి రైతును తెగుళ్లు, నాసిరకం విత్తనాలు నట్టేట ముంచాయి. పండిన పంట పనికి రాకుండా పోతూండటంతో చేసేదేమీ లేక ఆరుగాలం పండించిన పంటను రైతులు తమ చేతులతో తామే నరికేస్తున్నారు. కాయ కాసినా పత్తి వచ్చే సమయానికి అది పగలకపోవడంతో దిగుబడి లేక తీవ్ర నష్టాలు చవిచూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లాంగ్‌పుల్ కాటన్, మీడియం స్టేపుల్ కాటన్, పొట్టి స్టేపుల్ కాటన్ అనే మూడు పత్తి రకాలను ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. గొల్లప్రోలు మండలం దుర్గాడలో సుమారు 400 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా 200 ఎకరాల్లో పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతు చిక్కని తెగుళ్లు, నాసిరకం విత్తనాల వల్లే ఇలా జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల ద్వారా వచ్చిన విత్తనాల్లో నాసిరకం ఉండవచ్చని రైతులు అంటున్నారు. అయితే, వారి ఆరోపణలను అధికారులు కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిని బట్టి జిల్లాలో పత్తి పంటకు ప్రమాదం పొంచి ఉందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూలి డబ్బు కూడా రాని దుస్థితి

జిల్లాలోని గొల్లప్రోలు, జగ్గంపేట, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరంతో పాటు తూర్పు గోదావరి జిల్లా రంగంపేట తదితర మండలాల్లో సుమారు 11,850 ఎకరాల్లో పత్తి సాగు జరుగుతోంది. పత్తి పంటకు సాధారణంగా కాయ తొలుచు పురుగు సోకడం, దాని నివారణకు మందులు పిచికారీ చేయడం జరిగేది. కొన్నేళ్ల క్రితం వరకూ గులాబీ రంగు కాయ తొలుచు పురుగు (పింక్‌బాల్ వార్మ్) పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగించేది. వివిధ రకాల మందులు పిచికారీ చేయడం ద్వారా దీనిని పూర్తిగా నివారించగలిగారు. అప్పటి నుంచీ దాని ప్రభావం తగ్గి రైతులకు దిగుబడి ఆశాజనకంగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లాలో గొల్లప్రోలు మండలంలో పత్తి పంట కాయ కాసినా అది పగిలి పత్తి రావాల్సి ఉండగా అలా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి కోసే కూలీకి రోజుకు రూ.500 ఇవ్వాల్సి ఉండగా ఒక్కో కూలీ రోజుకు 10 నుంచి 20 కేజీల వరకూ పత్తి కోస్తూంటారు. కానీ ప్రస్తుతం కాయ పగిలి పత్తి రాకపోగా కోసేటప్పుడు కాయ నుంచి పత్తితో పాటు కాయ కూడా వస్తూండటం, పత్తి తక్కువగా రావడంతో ఒక్కో కూలీ రోజుకు రెండు కేజీలు కూడా కోయలేకపోతున్నారని రైతులు చెబుతున్నారు. దీంతో రూ.500 కూలీకి ఖర్చు చేస్తే రూ.110 విలువైన పత్తి మాత్రమే వస్తోందని, దీంతో కోయడం ఆపేసి పత్తి పంటను నరికేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

భారీ నష్టమే

ఎకరానికి రూ.40 వేలు పెట్టుబడి పెట్టగా రూ.30 వేలు కౌలు ఇస్తున్నామని, ఇతర ఖర్చులు కలిపి ఎకరానికి రూ.80 వేల వరకూ పెట్టుబడి అవుతోందని, ప్రస్తుతం రూ.8 వేలు కూడా రాని పరిస్థితి ఎదురైందని రైతులు వాపోతున్నారు. ఒక్క గొల్లప్రోలు మండలంలోనే సుమారు 200 ఎకరాల వరకూ పత్తి పంట నష్టాల పాలవ్వడంతో రూ.1.60 కోట్ల మేర నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుతం పత్తి పంటకు నష్టం కలిగించే తెగుళ్లు ఉన్నట్టుగా భావిస్తున్నాం. అయితే నష్టం దేనివల్ల జరుగుతోంది, ఎలా జరుగుతోందనే విషయాలు నిర్ధారించడానికి శాస్త్రవేత్తలను పిలిచాం. వారు వచ్చి పంటలు పరిశీలించి నిర్ధారిస్తారు. ఈలోపు రైతులు తొందరపడి పంటను నరికేసుకోవద్దు. కొందరు రైతులు తొందరపడుతున్నారు. నష్టం జరిగినప్పుడు వివరాలు తెలుసుకోకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు నిర్ణయాలు తీసుకోకూడదు. ఇప్పటి నుంచీ జాగ్రత్తలు పాటించడం వల్ల కొంతవరకూ నష్టం నివారించుకోవచ్చు. అందుకే ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించడానికి ఏరువాక శాస్త్రవేత్తల ద్వారా సదస్సుల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రస్తుతం నష్టం వాటిల్లుతున్న పంటకు వ్యవసాయ శాఖ సూచనల ప్రకారం సస్య రక్షణ చర్యలు తీసుకోవాలి.

– స్వాతి, అసిస్టెంట్ డైరెక్టర్, వ్యవసాయ శాఖ, పిఠాపురం

పంట నరికించేస్తున్నాను



నేను ఒక ఎకరంలో పత్తి సాగు చేశాను. విత్తనాలు వేసే నాటి నుంచి చాలా జాగ్రత్తలు పాటించాను. కానీ పంట చేతికి వచ్చే సమయానికి అంతా మాయగా మారిపోయింది. పత్తి చేనులో కాయలు కనిపిస్తున్నాయి. కాని అవి పగలడం లేదు. పత్తి రావడం లేదు. ఎందుకిలా జరిగిందో అర్థం కావడం లేదు. విత్తనాల్లో తేడాలనుకుంటున్నాం. దీనికి తోడు పంటపై తెగుళ్ల ప్రభావం చూపించి ఉండవచ్చు. ఎకరానికి రూ.80 వేల పెట్టుబడి పోయింది. చేసేదేమీ లేక ఉన్న పంటను కూలీలను పెట్టి నరికించాల్సి వచ్చింది. విత్తనాలపై అధికారులు విచారణ చేయాలి. తెగుళ్లను నిర్ధారించాలి. ఏం చేసినా ఈ పంట మాకు లేనట్టే. ప్రభుత్వం ఆదుకోవాలి.

– వెలుగుల సత్యనారాయణ, పత్తి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి



నేను రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. పత్తి కాయలు పేలకపోవడంతో పంటను నరికేస్తున్నా. ఈ పంట పోయినట్టే. రెండో పంట కోసం భూమిని సిద్ధం చేసుకోడానికి ఉన్న పత్తి పంటను నరికేస్తున్నాం. పెట్టుబడి రాకపోగా పంటను నరికించేందుకు తిరిగి పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. చేసేదేమీ లేక పండించిన పంటను మా చేతులతో మేమే నరుక్కుంటున్నాం. ఇకపై పత్తి సాగు చేయాలంటే భయం వేస్తోంది. మాకు జరిగిన నష్టంపై అధికారులు విచారణ జరపాలి. కారణం ఏమిటో తెలుసుకోవాలి. మాకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి.

– మేడిబోయిన శివ, పత్తి రైతు, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

పిండినల్లి వల్లే పంటకు నష్టం

ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుధారాణి



రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

పిఠాపురం: పిండినల్లి ఆశించడం వల్లే పత్తి పంటకు నష్టం వాటిల్లుతోందని, రైతులు జాగ్రత్తలు పాటించి నష్టాలు నివారించుకోవచ్చని ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎస్.సుధారాణి సూచించారు. మంగళవారం గొల్లప్రోలు మండలం దుర్గాడ రైతు సేవ కేంద్రంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ, పిఠాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు పి.స్వాతి తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పలు సూచనలు ఇచ్చారు. దుర్గాడలో వేసిన పత్తి పంటకు పిండి నల్లి ఆశించిందని, దీని నివారణకు ఎసిఫేట్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిలో గాని, ట్రోఫీకోనజోల్ మూడు మిల్లీ లీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని సర్ఫ్ గాని టీ పొలు గాని స్ప్రేయర్ కి 50 గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పంట నుంచి తీసిన పత్తిని దుకాణదారులు రూ.50 నుంచి రూ.55కు మాత్రమే కొంటున్నందున నష్టపోతున్నారని, వ్యవసాయ మార్కెట్ కమిటీ పిఠాపురం మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రంలో రూ.71 నుంచి రూ.75 వరకు విక్రయించవచ్చునని, దీనిపై రైతులు అవగాహన పెంచుకోవాలని వారు వివరించారు. పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త శర్మ మాట్లాడుతూ మినుములు, నువ్వు పంటపై చేయవలసిన సస్య రక్షణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, రైతులు, ఎంపీటీ కేవీవీ సత్యనారాయణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది కె.పద్మిని, ఎస్.దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరి ఘాట్‌రోడ్డులో అగ్నిప్రమాదం

- కారులో వ్యాపించిన మంటలు
- వెంటనే దిగి తప్పించుకున్న భక్తులు



ప్రమాదంలో ధ్వంసమైన కారు



మంటలకు కాలిపోయిన స్టీరింగ్ ముందు భాగం

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి మంగళవారం తాడేపల్లిగూడెం నుంచి కారులో వచ్చిన భక్తులకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. వారు ప్రయాణిస్తున్న కారులో అగ్నిప్రమాదం సంభవించి కారు బోనెట్ నుంచి మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన భక్తులు వెంటనే బయటకు వచ్చి ప్రాణాలు దక్కించుకున్నారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు ఏలూరు జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఇద్దరు చిన్నారులతో సహా ఏడుగురు మంగళవారం సత్యదేవుని దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ఘాట్‌రోడ్ రెండో మలుపులో కారు ఇంజిన్ నుంచి పొగ రావడాన్ని గమనించి పక్కకి ఆపి అందరూ దిగిపోయారు. కారు లోపలకు మంటలు వ్యాపించడంతో స్టీరింగ్ వద్ద ముందు భాగం కాలిపోయింది. వెంటనే తమ వద్దనున్న వాటర్ బాటిళ్లలోని నీళ్లతో మంటలు అదుపు చేశారు. తరువాత వేరే కారులో తమ స్వస్థలానికి చేరుకున్నారు. ఎవరికీ ఏ అపాయం కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగుతున్న అక్రమ అరెస్టులు

- వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టు
- 17 మందిలో వైస్ ఎంపీపీ, ఇద్దరు కౌన్సిలర్లు



కోర్టు నుంచి బెయిల్‌పై విడుదలైన బాలు, ఖ్వాజాలు

తుని/తుని రూరల్: ప్రభుత్వ విధి విధానాలకు, టీడీపీ, జనసేన, బీజేపీలకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీకి లబ్ధి చేకూర్చేందుకు నియోజకవర్గంలో రాజకీయ అనిశ్చితి ప్రేరేపించేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టిన 17 మందిని అరెస్టు చేసినట్టు రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు తెలిపారు. తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం పట్టణ సీఐ గీతారామకృష్ణ, రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారితో కలసి రూరల్ సీఐ విలేకరులతో మాట్లాడారు. అరెస్టైన వారిలో తుని పట్టణ, తుని, కోటనందూరు, తొండంగి మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. వీరిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు సీఐ తెలిపారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసినా, తప్పుడు సమాచారాన్ని బదిలీ చేసినా శిక్షార్హులన్నారు. రెండుసార్లు కేసులు నమోదైన తర్వాత ఇటువంటి తప్పిదానికి మూడోసారి (ఆర్గనైజ్డ్ క్రైం) పాల్పడితే నాన్ బెయిల్‌బుల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కేసులో ఐదు నుంచి 20 సంవత్సరాలు జైలు శిక్ష పడుతుందన్నారు. కక్ష సాధింపులు లేవని, ఏ పార్టీవారు ఆధారాలు ఇచ్చినా సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

అరెస్టైన వారు

వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు, తుని కౌన్సిల్‌లో కో–ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, 14వ వార్డు కౌన్సిలర్, పట్టణ యూత్ కన్వీనర్ షేక్ ఖ్వాజా మోహిద్దీన్, తొండంగి మండలం వైస్ ఎంపీపీ నాగం గంగాధర రావు, వైఎస్సార్ సీపీ కోటనందూరు మండల కన్వీనర్ చింతకాయల సన్యాసి రాజా విశ్వనాథ్ (చినబాబు), వెలుగొండి జార్జి కిరణ్ (జార్జిరెడ్డి), ఇసరపు సాయి, మొగసాల నాగ రామశ్రీను, దిబ్బ శ్రీను, పెంటకోట వెంకట రామలింగ సురేష్, కోరుమల్లి లలిత, అడపా సురేష్, గణేసుల వీర వెంకటరమణ (వీరబాబు), బంగారు బ్రహ్మానాయుడు, యలమంచిలి మణికంఠ, కాకినాడ గణేష్ (నాని), చింతనీడి గణేష్, కుర్మయ్యగారి హనుమంత్ రెడ్డి (అన్నమయ్య జిల్లా) అరెస్టయ్యారు. 15 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చామని, ఏలూరి బాలు, షేక్ ఖ్వాజాలను కోర్టులో హాజరుపర్చామన్నారు.

లారీని ఢీకొని భర్త మృతి


భార్యకు గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారి పక్కన నిర్లక్ష్యంగా నిలిపిన లారీని ఢీకొని టూ వీలర్‌పై వెళ్తున్న దంపతుల్లో భర్త మృతి చెందగా, ఆయన భార్యకు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపిన వివరాల మేరకు కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన చల్ల వెంకటరమణ, భార్య లక్ష్మి మోటార్ సైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తున్నారు. మండలంలోని మురారి శివారు దాబా వద్దకు వచ్చే సరికి రోడ్డు పక్కన నిలిపిన లారీని వెనక నుంచి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయమైన వెంకటరమణ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి : ఇద్దరికి గాయాలు

ముమ్మిడివరం: మండలం నడిమిలంక సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గొల్లల మామిడాడకు చెందిన కోత మెషీన్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న యు. అనుకుమార్, యు.అభిషేక్, ఎ.సురేష్ మచిలీపట్నం నుంచి మంగళవారం తెల్లవారుజామున గొల్లల మామిడాడ వెళ్తుండగా మోటార్ సైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అనుకుమార్ (23) అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అభిషేక్, సురేష్ ఆ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ జి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడితో లేగదూడ మృతి



మృతి చెందిన లేగదూడ

సామర్లకోట: కుక్కల దాడితో ఒక లేగదూడ మృతి చెందింది. స్థానిక లారీ యూనియన్ కార్యాలయం వద్ద పశువుల మకాంలో ఉన్న సుమారు ఆరు రోజుల లేగదూడపై సోమవారం రాత్రి సుమారు పది కుక్కల వరకు దాడి చేశాయని రైతు పుట్టా వీర్రాజు తెలిపాడు. తాను కర్రతో ఎంత బెదిరించినా వదలకుండా లేగదూడను తీవ్రంగా గాయపరచడంతో అది మృతి చెందిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు నెల రోజుల క్రితం 8 రోజుల లేగదూడపై దాడి చేసి చంపేశాయని, కుక్కలు గుంపులు, గుంపులుగా రావడంతో జనం రోడ్లపై ఒంటరిగా రాత్రి సమయంలో తిరగడానికి భయపడుతున్నారన్నారు. రెండు రోజుల క్రితం విధులకు వెళ్తున్న దేవదాయశాఖ ఉద్యోగి కుక్కకాటుకు గురయ్యారు. కుక్కల సంతతి పెరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సీబీఐ పేరుతో ఫేక్ కాల్స్

ఆందోళన చెందుతున్న స్థానికులు

అమలాపురం టౌన్: పిల్లలు దూర ప్రాంతాల్లో ఉంటున్న కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం.. అని హిందీలో మాట్లాడుతూ, అవతలి వారు మానసికంగా లొంగిపోయారని నిర్ధారించుకున్న తరువాత డబ్బులు డిమాండ్ చేస్తూ సీబీఐ పేరుతో వస్తున్న ఫోన్‌కాల్స్ స్థానికంగా పలువురిని ఆందోళనకు గురిచేస్తున్నాయి. అటువంటి కాల్స్ రిసీవ్ చేసుకున్న వారు బెంబేలెత్తిపోయి దూర ప్రాంతాల్లో ఉన్న తమ పిల్లలకు సమాచారం ఇస్తున్నారు. ఇంకొందరు తమకు పరిచయమున్న పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారు. ఫేక్ కాల్స్ మాట్లాడుతున్న సమయంలో ఎవరో మగ లేదా ఆడగొంతుతో ఆర్తనాదాలు వినిపిస్తుండడంతో ఇటువైపు మాట్లాడుతున్న వారు హడలిపోతున్నారు. స్థానికుడైన ఓ వ్యక్తికి మంగళవారం దాదాపు పది కాల్స్ రాగా ఫోన్‌లో అవతలి వ్యక్తి ఓ పేరు చెప్పి మీకేమవుతుందని అడగడం.. మా అన్న కూతురని ఇటునుంచి బదులు ఇవ్వడం.. వెంటనే అరెస్టు అంటూ పదేపదే చెప్పడంతో స్థానికుడు బెదిరిపోయారు. ఇలాగే పలువురికి ఫేక్ కాల్స్ వస్తున్నట్టు తెలిసింది. ఈ విషయమై పట్టణ సీఐ పి.వీరబాబుకు వివరించగా అవి ఫేక్ కాల్స్ అని, అటువంటి నంబర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని సూచించారు. సీబీఐ అధికారులు అరెస్టుకు వస్తే స్థానిక పోలీసుల సహకారంతో వస్తారని, ఇటువంటి బెదిరింపులకు పాల్పడరని ఆయన వివరించారు.

ప్రపంచ స్థాయి పరిశోధనలు అవసరం



పరిశోధన సమావేశాల్లో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాణిజ్య పంటల పరిశోధనా కేంద్రంగా సీటీఆర్ఐ రూపాంతరం చెందుతున్న తరుణంలో పరిశోధన కమిటీ సమావేశాలు అత్యంత ప్రాధాన్యం సంతరించుకున్నాయని, వ్యవసాయ శాస్త్రవేత్తలు ప్రపంచ స్థాయిలో పరిశోధనలు చేపట్టాలని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. మంగళవారం రెండో రోజు మూడు, నాలుగో సాంకేతిక సమావేశానికి ఆయనతో పాటు ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ డీన్ డాక్టర్ జె.కృష్ణప్రసాద్, సీటీఆర్ఐ పూర్వ డివిజన్ హెడ్ డాక్టర్ యు.శ్రీధర్, ఇన్నోవేషన్ హబ్, ఇక్రిసాట్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. శ్రీకాంత్ నిపుణులుగా వ్యవహరించారు. పలువురు శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ఫలితాలను వివరించారు.

వచ్చేనెల 8 నుంచి దివ్యాంగుల క్రికెట్ టోర్నీ

- అఖిల భారత దివ్యాంగుల హక్కుల జాతీయ కార్యదర్శి పోసికుమార్
- విశాఖపట్నం గాజువాకలోని జింక్ మైదానంలో నిర్వహణ
- విజయవంతం చేయాలని జిల్లా కెప్టెన్ బలరామకృష్ణ పిలుపు

సీటీఆర్ఐ: దివ్యాంగుల క్రికెట్ టోర్నీ వచ్చేనెల 8వ తేదీ నుంచి విశాఖలో నిర్వహిస్తున్నట్టు అఖిల భారత దివ్యాంగుల హక్కుల జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్ అన్నారు. రాష్ట్ర దివ్యాంగుల క్రికెట్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి పల్నాటి బలరామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వై జంక్షన్ వద్ద ఈ టోర్నీ సన్నాహక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోసికుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు విశాఖలోని గాజువాక జింక్ గ్రౌండ్‌లో పది జిల్లాల దివ్యాంగుల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 98858 64940, 92473 86666 ఫోన్ నెంబర్లను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. 22వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు లాలాచెరువు మైదానంలో ఎంపికలు ఉంటాయన్నారు. బలరామకృష్ణ మాట్లాడుతూ ఈ సదవకాశాన్ని దివ్యాంగులంతా ఉపయోగించుకోవాలని, బుధ, గురు వారాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ముత్తూట్ మనప్పురం ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. ✆ : 98491 38626 [R-1260825]

Wanted

■ ప్రముఖ కంపెనీలో లోన్స్ ప్రమోట్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ✆ : 62817 92982 [R-1260827]

■ ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు, టెలికాలర్స్, ఏజెంట్ (or) సూపర్‌వైజర్స్ కావలెను. పార్ట్/ఫుల్‌టైమ్, శాలరీ 8000 నుండి 15,000/- వరకు + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. అందరూ అర్హులే. ✆ : 91543 05592 [R-1260829]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ ఓల్డ్ రికార్డ్సు చూసి, న్యూ రికార్డులు వ్రాయుటకు స్త్రీ, పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12,000/-. ఫోన్: 95507 45296 [V- 6602]

■ వ్యాన్ డ్రైవర్స్ కావలెను. జీతం : 15,000 + 3,000/-. సంప్రః శ్రీదేవి హోండా, ఆథరైజ్డ్ డీలర్స్, హోండా టూ వీలర్స్, టూటౌన్ పోలీస్‌స్టేషన్ దగ్గర, మెయిన్‌రోడ్, కాకినాడ. సెల్ : 97019 67408 [R-92]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253919]

■ రాజమండ్రిలో మా ఆఫీస్‌కు లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. 10th to డిగ్రీ. రూమ్ + భోజన, వసతి కలదు. దేవిచౌక్, రాజమండ్రి. ✆ : 94921 44369 [R-825]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం.HYD.7995984445 [HA-99066]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.